మాధురి కిటికీ దగ్గిర నుంచుంది.

రోడ్డుమీద కార్లు, బస్సులు, రిక్షాలు పెద్ద రొద చేసుకొంటూ పోతున్నాయి. సంవత్సరం దాటిపోయింది ఆ ఇంట్లో దిగి. మెయిన్ రోడ్డుపక్కనే ఉందా ఇల్లు. రాత్రింబగళ్ళు అదే మోత, హారన్లు, రిక్షా గంటలు, ఒకటే ధ్వని, నవ్వులు, కేకలు.

అవన్నీ కూడా ఎంత చికాకు కలిగించినా అలవాటయిపోయాయి. ఆ మోతలోనే వంట చేసుకోవడం, ఆ మోతలోనే స్నానం చేయడం, ఆ మోతలోనే ఆఫీసుకి వెళ్ళడం, ఆ మోతలోనే నిద్రపోవడం.

నిత్య జీవితంలో ఆ శబ్దాలన్నీ నేపథ్య సంగీతం అయిపోయాయి.

తలుపు తట్టిన శబ్దమయింది.

వెళ్ళి తలుపు తీసింది మాధురి. చేతిలో సూట్‌కేస్‌తో నుంచుని ఉన్నాడతను.

"నమస్కారమండీ! నా పేరు జగన్!" అన్నాడు నవ్వుతూ.

"లోపలకు రండి!" అంది మాధురి

ఆమె వెనకే లోపలికి వచ్చాడతను. సూట్‌కేస్ ఓ మూలగా ఉంచి కుర్చీలో కూర్చున్నాడు.

"మీ బాబాయిగారు నా గురించి రాసిన ఉత్తరం చేరిందనుకొంటాను మీకు!" అన్నాడు రుమాలుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకొంటూ.

"మొన్నే చేరింది."

అతనికి లోపల ఉక్కపోస్తున్నట్లుంది, టేబుల్ మీదున్న పేపరు అందుకొని, మడిచి, విసురుకోసాగాడు. అది గ్రహించి మాధురి టేబుల్ ఫాన్ ఆన్ చేసింది.

"థాంక్యూ!" అన్నాడతను.

"మీకు నేను గుర్తున్నానా?" అడిగింది మాధురి.

"గుర్తంటే, చిన్నప్పుడు బాబాయిగారింట్లో ఓ అమ్మాయితో ఆడుకొనే వాడినని గుర్తుందికాని, అప్పటి మీ రూపం, ముఖం—ఇవేమీ గుర్తులేవు." నవ్వుతూ అన్నాడతను.

"అవున్లెండి. మీరు బాగా చిన్నవాళ్ళప్పుడు. నాకంటె రెండేళ్ళు తక్కువ వయస్సు. మా ఆడపిల్లలందరం ఆటలాడుకొంటూంటే, మీరు మా వెంట పరిగెడుతూండేవాళ్ళు!"

ఉత్సాహంగా అందామె.

అతను వింటూండిపోయాడు.

"అప్పుడే మీ రెక్కడికో బదిలీ అయి వెళ్ళిపోయారు. అంతే—ఆ తరవాత మిమ్మల్నిదే చూడటం."

కొద్దిసేపు నిశ్శబ్దం అలుముకొంది.


"నా ఇంటర్వ్యూ సంగతి ఏమయినా తెలుసుకొన్నారా?" అడిగా డతను.

"కనుక్కొన్నాను. మా ఆఫీసరే ఇంటర్వ్యూ చేస్తారట. ఆయనని కలుసుకొని మీ గురించి చెప్పాను—కావలసిన వారని, దగ్గిర బంధువనీను. తప్పక సెలక్ట్ చేస్తానని చెప్పారు."

అతని ముఖంలో అంతవరకూ ఉన్న బెదురూ, దిగులూ మాయమయిపోయాయి.

"అంటే, ఇక ఈ ఉద్యోగం దొరకడం గారంటీయే నంటారా?" సంతోషంతో అడిగాడు.

"ఆ మాటకి తొంభై తొమ్మిది పాళ్ళు గారంటీయే. ఆయన చాలా మంచి మనిషి. ఏ సహాయం కావాలన్నా స్టాఫంతా ఆయననే బ్రతిమాలి పనులు జరిగేట్లు చూసుకొంటారు."




"చాలా థాంక్సండీ! అభిమానంతో ఎంతో సహాయం చేశారు!" కృతజ్ఞత మెరిసిందతని కళ్ళలో.

"చిన్నప్పటి స్నేహితులం. ఆమాత్రం సహాయాలు చేసుకోకపోతే ఎలా?" నవ్వుతూ అందామె.

"మరి నే నిక వెళ్ళిరానా?" వెళ్ళబోతూ అడిగా డతను.

"ఎక్కడికి వెళుతున్నారు?"

"ఏదయినా హోటల్‌లో గది తీసుకొంటాను— ఇంటర్వ్యూ రిజల్ట్సు వచ్చేవరకూ."

"ఉండండి. కాఫీ తీసుకొస్తాను."

"ఇప్పుడెందుకండీ—మీకు శ్రమ?" ఇబ్బందిగా అన్నా డతను.

"మరేం ఫరవాలేదు లెండి."

లోపలికి వెళ్ళిందామె.

ఆ గది అంతా పరిశీలనగా చూశా డతను. ఒంటరిగా ఉండే స్త్రీ గది ఎలా ఉంటుందా అన్న కుతూహలం. గోడకు రెండు, మూడు కాలెండర్లు. ఓ మూలగా ఇనప మంచం. కిటికీలకు అందమైన కర్టెన్లు. టేబులూ, దాని ముందు రెండు కుర్చీలూ, టేబుల్ మీద అలారం గడియారం, ఒక లేడీస్ వాచీ, రెండు పెన్నులూ, కొన్ని ఇంగ్లీష్ నవలలూ, ఉమన్స్ మాగజైన్లూ.

గోడకే ఉన్న మరో అల్మారాలో పెద్ద అద్దం, మేకప్ సామానూ, తలుపు పక్కగా రెండు జతల చెప్పులూ, హాంగర్‌కి వేలాడుతున్న ఖరీదయిన చీరలూ.

కాఫీ తీసుకుని వచ్చింది మాధురి.

"మీరు తీసుకోరేం?" అడిగా డతను.

"మీరు వచ్చే ముందే తీసుకొన్నాను." గోడకు ఆనుకొని నిలబడిందామె.

అతను కాఫీ తాగడం ముగించి కప్పు టేబుల్ మీద ఉంచాడు.

"ఇంక వెళ్తానండీ!" అన్నాడు లేచి సూట్ కేస్ అందుకొంటూ.

"రేపు పది గంటల కల్లా ఆఫీసుకు వచ్చేయండి. స్టెనో మాధురి అంటే ఎవరన్నా చూపుతారు నే నుండే ప్లేస్."

"అలాగేనండీ. థాంక్యూ!"

అతను బయటికి నడిచాడు.

వెళ్ళిపోతున్న అతని వంకే చూసి, అతను జనంలో కలిసిపోయాక, తలుపులు మూసివేసిందామె.

కొద్ది క్షణాలు జగన్ గురించే ఆలోచనలు చుట్టుముట్టాయామెని.

యర్రంసెట్టి శాయి

అతనిలో కొద్ది పోలిక లున్నాయిగాని, చాలా మార్పు వచ్చింది. బాబాయి దగ్గిరనించి ఉత్తరం వచ్చేసరికి తన అప్పటి జగన్నే ఊహించుకొంటూంది.

పొట్టి నిక్కరు, గుండీలు లేని చొక్కా, ఉంగరాల జుట్టు.

ఇప్పు డతను అందంగా ఉన్నాడు. అతనిలో హుందాతనం ఉంది. ఆకర్షణ ఉంది.

నవ్వుకొంది మాధురి.

కిటికీ పక్కనుంచే పెద్ద ట్రక్కేదో గుండెలు అదిరేలా మోత చేసుకొంటూ వెళ్ళింది.

మరునాడు తనకంటె ముందే ఆఫీసుకి వచ్చా డతను.

వరండాలోనే ఎదురయ్యాడు.

"గుడ్‌మార్నింగ్!" అన్నాడు చిరునవ్వుతో.

"గుడ్‌మార్నింగ్! నాతో రండి."

ఇద్దరూ ఆమె గదిలోకి నడిచారు.

తను టైప్ మిషన్ ముందు కూర్చుని, అతనికి ఎదుటి కుర్చీ చూపించిందామె.

"చాలా పెద్ద ఆఫీసే ఇది. కొత్తగా చేరిన వాళ్ళకి తోవ తెలుసుకోవడంకూడా కష్టమే!" అన్నా డతను నవ్వుతూ.

ఆమె నవ్వి ఊరుకొంది.

"ఒక్క నిమిషం. ఓ కాగితం టైపు చెయ్యాలి" అంటూ టైప్ చెయ్యడంలో నిమగ్నురాలయిపోయింది.

టైపుమిషను మీద నాట్యం చేస్తున్న ఆమె సుందరమైన చేతివేళ్ళ వంకే చూస్తూ కూర్చున్నా డతను.

అది గమనించి లోలోపలే నవ్వుకొందామె.

టైపు చేసిన కాగితం తీసుకువెళ్ళి ఆఫీసర్ దగ్గిర సంతకం తీసుకొని, ప్యూన్‌ని పిలిచి ఆ కాగితం సెక్షన్‌కి పంపించివేసింది.

మరి కొద్దిసేపటికి జగన్‌ని ఇంటర్వ్యూకి పిలిచారు.

"విష్ యూ బెస్ట్ లక్!" అందామె బయటే నిలబడిపోయి.

"థాంక్యూ!" అని లోపలికి నడిచా డతను.

పది నిమిషాలపాటు టైప్ మిషన్ ముందే కూర్చుని అతనికోసం ఎదురు చూస్తూ గడిపిందామె.

అతను తిరిగి వచ్చాడు.

అతని వంక ప్రశ్నార్థకంగా చూసిందామె.

అతను నవ్వుతూ కుర్చీలో కూర్చుంటూ—"అన్నిటికీ అద్భుతంగా సమాధానాలు చెప్పాను!" అన్నాడు.

"పర్సనల్ విషయాలేమయినా అడిగారా?"

"ఒక్కటే—మీకు నే నేమవుతానని అడిగారు."

"ఏమని చెప్పారు?" ఆత్రతగా అడిగిం దామె.

"మా నాన్నని మీరు 'మామయ్యా' అని పిలుస్తూండే వాళ్ళు కదా? అందుకని అదే చెప్పేశాను, మాధురి గారికి మామయ్య కొడుకుని." నవ్వుతూ అన్నా డతను.

ఆమె చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. కళ్ళు కిందికి దించుకొని, ఒక వేలితో టైప్ 'కీ' లన్నీ నెమ్మదిగా నొక్కి వదిలెయ్యసాగింది.

"ఫలితాలు రేపే తెలుస్తాయట. సెలక్టయిన వాళ్ళ పేర్లు రేపు ఉదయం బోర్డు మీద తగిలిస్తారట." తిరిగి అన్నా డతను.

"బహుశా సాయంత్రానికే నాకు తెలిసిపోతుంది లెండి. లిస్ట్ నా దగ్గిరికే వస్తుంది" అం దామె.

"ఐ సీ. అలాగయితే మరీ మంచిది... సాయంత్రం మిమ్మల్ని కలుసుకొంటాను" అన్నా డతను ఉత్సాహంగా.

"రండి. పోనీ ఓ పని చెయ్యండి. రాత్రికి అక్కడే భోజనంచేద్దురుగాని. ఇంటికి వచ్చెయ్యండి!" అం దామె అప్పటికప్పుడు ఆలోచించుకొంటూ.

"భోజనానికా! మీ కింత ఇబ్బంది కలగ జెయ్యటం నా కిష్టంలేదు."

"ఇందులో ఇబ్బం దేముంది? మీ కోసం ప్రత్యేకం వంట చెయ్యటం లేదుగా? నా తోబాటే." తేలిగ్గా కొట్టిపారేస్తూ అం దామె.

అతను ఇంకేమీ మాట్లాడలేక పోయాడు.

"సరే. నేను హోటల్‌కి వెళ్ళి, కాసేపు ఊరంతా ఓ రౌండ్ కొట్టి సాయంత్రానికి మీ ఇంటికి చేరుకొంటాను" అన్నా డతను కుర్చీలోంచి లేస్తూ.

ఆమె అంగీకార సూచకంగా చిరునవ్వుతో తల ఊపింది.

అతను వెళ్ళిపోయాడు.

కొద్ది క్షణాలు అలాగే కూర్చుండిపోయి, అంతలోనే తేరుకొని ట్రేలో పేరుకుపోతున్న కాగితాలు టైప్ చెయ్యసాగింది.

సాయంత్రం ఆఫీసర్ ఓ లెటర్ డిక్టేట్ చేశాక ఆ రోజు ఇంటర్వ్యూలో సెలక్టయిన వాళ్ళ లిస్ట్ ఆమె చేతి కందించాడు.

"రేపు ఇది నోటీస్ బోర్డ్ మీద 'ఎగ్జిబిట్' చెయ్యాలి" అన్నాడు.

"ఎస్సార్!" అంది మాధురి లిస్ట్ తీసుకుంటూ.

"మీ కాండిడేట్‌ని కూడా సెలక్ట్ చేశాను." తిరిగి అన్నా డతను.

ఆమె ఆనందంతో అతని వంక చూసింది. "థాంక్యూ, సర్! థాంక్యూ సో మచ్!"

"దట్సాల్‌రైట్! అతను కూడా మంచి స్టఫ్ ఉన్న వాడే. మువ్వు రికమండ్ చెయ్యకపోయినా సెలక్టయ్యే వాడు."

ఆమె బయటికి వడిచింది.

త్వరత్వరగా పని పూర్తి చేసుకొని అయిదు గంటల కల్లా ఆఫీసర్ వెళ్ళి పోగానే తనూ బయటికి వచ్చేసింది.

ఇల్లు చేరుకునేసరికి పనిమనిషి ఎదురుచూస్తూ కూర్చుని ఉంది.

"ఈవేళ వెజిటబుల్ బిరియానీ తయారు చెయ్యాలి" అంది మాధురి ఆమెతో.

"చుట్టాలెవరైనా వస్తున్నారామ్మా!" కొంచెం ఆశ్చర్యంతో అడిగిం దామె.

"అవును." ముక్తసరిగా జవాబిచ్చింది మాధురి.


ఏడు గంటలకల్లా వంట పూర్తయింది.

అద్దం ముందు నిలబడి స్నో రాసుకొంటూండగా తలుపు తట్టిన శబ్దమయింది. త్వర త్వరగా పౌడర్ రాసేసుకొని బయటికి వచ్చి తలుపు తీసింది.

జగన్ నవ్వుతూ లోపలికి వచ్చాడు.

"కంగ్రాచ్యులేషన్స్!" అం దామె.

"నేనే మీకు చెప్పాలది. ఎందుకంటే, మీరే నన్సెలక్ట్ అయ్యారు, నన్ను రికమెండ్ చేసి!"




"రికమండేషన్ లేకపోయినా సెలక్టయ్యే వారని మా ఆఫీసరుగా రన్నారు."

అతను నవ్వి ఊరుకొన్నాడు.

రోడ్డుమీద రద్దీ చాలా ఎక్కువగా ఉండటం చేత గట్టిగా మాట్లాడుకో వలసి వస్తోంది.

లారీ ఒకటి పెద్దగా శబ్దం చేసు కొంటూ వెళ్ళింది.

మాధురి కిటికీ తలుపులు మూసి వేసింది.

"అబ్బ! మీ రీ గొడవ ఎలా భరిస్తున్నారు?" అడిగా డతను.

"అలవా టయిపోయింది. ఎంతగా అలవాటయిపోయిందంటే, అది లేనిదే నిద్ర కూడా పట్టటం లేదు!" నవ్వుతూ అం దామె.

అతనూ నవ్వేశాడు.

"మీకు ఆ కిటికీ దగ్గరముంటే చాలు మంచి కాలక్షేపం కూడాను!"

ఆమె మందహాసం చేసింది.

"ఓ పని చేస్తే బాగుంటుంది. ఆ కిటికీని బయటునుంచి అద్దాలతో మూసెయ్యాలి. అప్పుడు శబ్దాలు వినబడవు."

మాధురికి నిజమే ననిపించింది. ఇంత కాలం తన కీ ఆలోచన కూడా రాలేదు.

"మీరు చెప్పిన ఆలోచన బాగుంది. రేపే చేసెయ్యాలి ఆ పని" అంది కొద్దిసేపాగి.

"నాకు చిన్నప్పటి నుంచీ అద్దాల కిటికీలోనుంచి చూడటం ఇష్టం!" అన్నా డతను.

"నాకూ అంతే!" నవ్వుతూ అం దామె.

అతణ్ణి చూస్తూంటే ఆమె మనసంతా ఆదోలా అయిపోతూంది. అతనూ తన గురించి ఏమయినా ఆలోచిస్తున్నాడా? అతను శాశ్వతంగా తనతో, తన దగ్గిరే ఉంటే బాగుండుననిపిస్తూంది. కాని, అదెలా సాధ్యం? ఏం? ఎందుకు సాధ్యంకాదు? తను అతనిని ప్రేమిస్తున్నట్లే అతనూ తనని ప్రేమించకూడదూ?

తన ఆలోచన తనకే ఎబ్బెట్టుగా కనిపించిం దామెకి.

లేకపోతే ఏమిటి?

వయసులో ఉన్న యువకుడు—అందంగా, ఆకర్షణీయంగా ఉన్నవాడు. తనలాంటి భర్త చనిపోయిన స్త్రీని ఎందుకు ప్రేమిస్తాడు? అతనికంటె వయసులో పెద్దదయిన తనని ఎలా ప్రేమిస్తాడు?

కాని, అతని ముందు అలాంటి సంఘటనలు జరిగాయని వింది తను.

భర్త పోయిన స్త్రీలు మళ్ళీ వివాహం చేసుకోవడం, కొంత మంది ప్రేమికులలో స్త్రీకే ఎక్కువ వయస్సుండటం — ఇది అసహజమేమీ కాదు. తన ఉద్దేశంలో తప్పు కూడా కాదు.

కాని ... కాని ... మరి ...

జగన్ వంక చూసిం దామె.

అంతవరకూ తనవంకే చూస్తున్న అతను చూపులు మరల్చుకొన్నాడు.


"పదండి, భోజనం చేద్దాం" అంది మాధురి.

ఇద్దరూ వంటింటిలోకి నడిచారు. ఓ మూల గాస్ స్టవ్ — మరో మూల చిన్న డైనింగ్ టేబుల్, రెండు కుర్చీలూ ఉన్నాయి.

డైనింగ్ టేబుల్ మీద అన్నీ సిద్ధంగా అమర్చి ఉన్నాయి.

"కూర్చోండి" అంటూ ఆ వో కుర్చీలో కూర్చుం దామె.

# బ్రహ్మానందం



5-1-77

రాజకీయ, సాహిత్య రంగములలోనే కాక, లలిత కళలందు కూడా ప్రత్యేక స్థానం ఏర్పరుచు కున్న చరిత్రాత్మకమైన మచిలీపట్టణములో భారతీయ సాంప్రదాయ చిత్రకళను పునరుజ్జీవితం చేయుడానికి అమోఘ మైన కృషి చేస్తున్న చిత్రకారుడు శ్రీ మేడపర్తి బ్రహ్మానందం.

ఆయన ఇక్కడి ఈడేపల్లిలో 1941 లో 'కళారామము' అనే చిత్ర కళా పాఠశాలను గురుకుల పద్ధతిలో నెలకొల్పి, చిత్రలేఖనం, శిల్పములలో అనేక మందికి ఉచితంగా శిక్షణ నిస్తూ, మన ప్రాచీన చిత్రకళను పెంపొందించు టకు కృషి చేస్తున్నారు.

స్థానిక చిత్రకళా సంపద్. వారు వారి చిత్రాలను, శిష్యుల చిత్రాలను సుమారు 60 చిత్రాలతో గొప్ప చిత్రకళా ప్రదర్శనను ఇటీవల నిర్వ హించారు. ఈ ప్రదర్శన వేల కొలది కళాభిమానులను ఆకర్షించింది ... శ్రీ బ్రహ్మానందం గీసిన 'శివ సతి' ఒకటి. తైలవర్ణములలో "వాష్" చేసే చిత్రా లను వేసే కొత్త ప్రక్రియను ప్రవేశ పెట్టి దానియందు ఆయన సిద్ధహస్తు లయ్యారు.

శ్రీ బ్రహ్మానందం 1911 లో విజయవాడ మొగలిరాజపురంలో, శ్రీ ఆంజనేయులు, శ్రీమతి ఈశ్వరమ్మ లకు జన్మించారు. చిన్న నాటినుండి వీరికి లలిత కళలందు అభిరుచి. బందరు లోని ఆంధ్ర జాతీయ కళాశాలలో చేరి, అప్పటి ప్రిన్సిపల్ శ్రీ అడివి బాపిరాజుగారి వద్ద చిత్రకళ నభ్యసించారు. స్కూలు ఫైనలు వరకు చదివినా, వీరు కళావ్యాసంగం లోనే ఎక్కువ కృషి చేశారు. 1929 లో గాంధీజీ ప్రభావం వల్ల, ఖాదీ ఉద్యమాలలో పాల్గొని నాటి నుండి నేటికీ ఖాదీ కొల్లాయి దుస్తులనే ధరిస్తూ బ్రహ్మచర్యము నవలంబించి, సంగీత కళారీతులందు, సృజనాత్మకమైన కృషి కలుపుతూ, నిరాడంబరమైన జీవితాన్ని గడుపు తున్నారు. ఈయన చిత్రకారుడే కాక గొప్ప శిల్పికూడా. కొన్ని సంగీత వాయిద్య ములను సైతం నూతన రీతులలో తయారు చేశారు.

ఇటీవల కేంద్ర లలితకళా అకాడమీ (న్యూఢిల్లీ) ఉపాధ్యక్షుడు శ్రీ ఎన్. ఎస్. బెంద్రే చిత్రకళా విమర్శకుడు శ్రీ సంజీవ్‌దేవ్‌లు వీరి "కళారామాన్ని" తిలకించి శ్రీ బ్రహ్మానందం చిత్రకళా నైపుణ్యాన్ని, కళారామం ద్వారా చేస్తున్న కృషిని ప్రశంసించారు.

శ్రీ బ్రహ్మానందం చిత్రకళా రాధనకే తన జీవితాన్ని అంకితం చేసిన వారు. ముఖ్యంగా ఆయన నిర్వహిస్తున్న "కళా రామం" సంస్థ అభివృద్ధికి, తద్వారా మన సంప్రదాయ చిత్రకళ అభివృద్ధికి ప్రజల, ప్రభుత్వం యొక్క సహకారం, ప్రోత్సాహం అవసరం.

మానవులలో మనోవికాసాన్ని పెంపొం దించుటకు లలిత కళలు ఎంతో ఉపక రిస్తాయి. అప్పుడే మన సమాజం, దేశం కూడా సర్వతోముఖంగా అభివృద్ధి చెందగలవు.



శివ - సతి

— బొమ్మిరెడ్డిపల్లి
సూర్యచంద్రరావు

---

ఏవేవో కబుర్లు చెబుతూనే భోజనం చెయ్యసాగా డతను. ఆమె బలవంతంగా వడ్డించబోతూంటే, ఆమె చేతిని తన చేతో పట్టుకొని ఆపా డతను.

అతని స్పర్శకు ఆమె పులకించింది. ఎన్నో సంవత్సరాల తరువాత అనుభవి స్తున్న పురుష స్పర్శ. సంవత్సరం కూడా పూర్తిగా సంసారం చెయ్యలేక పోయిన దురదృష్ట జీవితం. భర్తతోబాటే అన్ని కోరికలూ సమాధి చేసింది ఇంతకాలం. కాని ... కాని ... ఇప్పుడు ... ఇన్నేళ్ళకు మళ్ళీ జగన్ తన యౌవనాన్ని, జీవితాన్ని మేల్కొలుపుతున్నాడు.

టేబుల్ కింద ఇద్దరి పాదాలూ తాకుతున్నాయి.

తాకినప్పుడల్లా నరాలు జివ్వుమని లాగేస్తున్నాయి.

'జగన్ — జగన్...' లోలోపలే పిలుస్తూం దామె.

'నేను ఒంటరిదాన్ని! నాకు నీ తోడు కావాలి! ఇంతకాలం ఎంతో మంది పురు షులు ఆశపడ్డారు. కాని నేను చలించ లేదు. నిన్ను చూశాక నన్ను నేను పోగొట్టుకొన్నాను.'

అతను చెయ్యి కడుక్కొని టవల్ అందుకొన్నాడు.

ఇద్దరూ ముందు గదిలోకి వచ్చారు.

"రేపట్నుంచీ ఇల్లు వెతకాలి నాకు" అన్నా డతను.

తన ఇంటి దగ్గరలోనే ఎక్కడయినా ఇల్లు ఖాళీగా ఉంటే బాగుండు ననిపించిం దామెకి.

"ఈ చుట్టుపక్కలే ఎక్కడయినా దొరికితే బాగుండును" అన్నా డతను.

కొద్ది క్షణాలు ఆమె హృదయం స్పందించడం మానేసింది.

అతనూ తన సాన్నిధ్యాన్నే కోరు కొంటున్నాడా?

"వెతకండి. నేనుకూడా ప్రయత్ని స్తాను" అంది కొద్ది క్షణా లాగి.

అతను వెళ్ళిపోయాడు.

తలుపులు మూసివేసి కిటికీ దగ్గిర కూర్చుందామె.

మొదటి ఆట సినిమా వదిలిన ట్లున్నారు. నియోన్ లైట్ల కాంతిలో స్త్రీ పురుషుల జంటలు ఆనందంగా నడుస్తూ వెళుతున్నాయి.

ఆటోరిక్షాలు పెద్దగా శబ్దం చేస్తున్నాయి.

టాక్సీల హారన్లు మోగించటం ఎక్కు వయింది. రోడ్డంతా నిండిపోయారు జనం. కోలాహలంగా, అడ్డదిడ్డంగా నడు స్తున్నారు.

ఎంత సేపు అలా చూస్తూనే కూర్చుండిపోయిం దామె.

క్రమక్రమంగా రోడ్డు మీద సందడి తగ్గిపోయింది. ఉండిఉండి ఓ లారీయో, టాక్సీయో, ఆటోరిక్షావో శబ్దం చేసుకొంటూ పోతూంది.

టైము చూసుకొంది మాధురి.

పన్నెం డయిపోయింది. లేచి వెళ్ళి పక్కమీద పడుకొంది. నిద్ర పట్టడం లేదు.

మరి కొద్దిసేపట్లో సెకండ్ షో వదిలిన జనం కోలాహలం.

ఆ గొడవంతా సర్దు మణిగే సరికి రెండయి పోయింది.

మరునాడు ఆఫీసుకి వెళ్ళిన కాసేపటికి జగన్ వచ్చాడు.

"లిస్ట్‌లో పేరు చూచుకోవడానికి వచ్చాను" అన్నాడు నవ్వుతూ.

"మళ్ళీ ఎల్లుండి కనబడతాను" అని వెళ్ళిపోయాడు.

ఆ రెండో రోజు ఉదయమే ఇంటికి వచ్చేశాడు.

"ఇల్లు దొరికింది. ఈ విషయం చెబుదామని వచ్చాను" అన్నాడు నవ్వుతూ,

"ఎక్కడ?"

"ఇక్కడికి దూరమే లెండి. ప్రశాంత్ నగర్ కాలనీలో."

ఆమె నిరుత్సాహ పడింది.

"అయినా, ఫరవాలేదు లెండి. ముందు ఎక్కడో ఓ చోట తల దాచుకొంటే, తరవాత ఇటు సక్కకి వచ్చెయ్యవచ్చు." అతనే అన్నాడు.

"అవును" అం దామె.

"అరె! కిటికీ అద్దం వేయించేశారే!" ఆశ్చర్యంగా కిటికీ దగ్గరకు నడుస్తూ అన్నా డతను.

"అవును. మనం ఆ విషయం మాట్లాడుకొన్నమర్నాడే వేయించేశాను."

కిటికీ అద్దంలోనుంచి బయటకు చూశా డతను.

చాలా రద్దీగా ఉంది రోడ్డు.

అయితే, శబ్దాలు అంత బిగ్గరగా వినిపించటం లేదు. చాలావరకూ తగ్గి పోయాయి.

"ఇప్పుడు బాగుంది" అన్నాడు సంతృప్తిగా.

"కాని, నాకు ఏమిటోగా ఉంది. ఆ శబ్దాలు సరిగ్గా వినిపించకపోతే, రోడ్డు మీద పోయే లారీలూ, కార్లూ, ఆటోలూ, రిక్షాలూ, మనుష్యులూ — జీవం లేనట్లనిపిస్తోంది. భరించలేక పోతున్నా నిది!" బాధ ధ్వనిస్తూన్న గొంతుతో అం దామె.

జగన్ నవ్వేశాడు. "భలేవారే మీరు!"

కొద్దిసేపు కూర్చుని అతను వెళ్ళి పోయాడు.

మరునాడే అతను ఆఫీసులో జాయి నయ్యాడు.

సుజాత దగ్గిర పని నేర్చుకోవలసిం దిగా ఆదేశించారు.

ఆ విషయం వింటూనే మరింత బాధ కలిగింది మాధురికి. సుజాత విషయం తనకు తెలుసు. ఆమె కింకా వివాహం కాలేదు. పైగా మగాళ్ళతో మరీ ఫ్రీగా మాట్లాడుతుంది.

ఒకవేళ ఆమె జగన్‌ని లోబరుచు కొంటే? వివాహం చేసుకోమని అడిగితే?

జగన్ అంత తేలిగ్గా ఒప్పుకుంటాడా? ఏమో?

మొదటి రోజు ఉండుండి వాళ్ళిద్దరినీ కనిపెడుతూనే గడిపింది మాధురి.

అయితే, ఇద్దరూ అతి తక్కువగా మాట్లాడుకోవటం చూసిన తరవాత కొంత ఉపశమనం కలిగింది.

వారం రోజులు గడిచిపోయాయి.

ప్రతి రోజూ మాధురిని ఓ సారయినా పలకరిస్తూనే ఉన్నాడు జగన్.

ఆదివారం ఉదయం హడావుడిగా ఆమె తలుపు తట్టా డతను.

ఆశ్చర్యంగా తలుపు తీసింది మాధురి.

"ఈవేళ మా ఇంట్లో డిన్నర్ మీకు. త్వరగా పదండి" అన్నాడు నవ్వుతూ.

మాధురి ముఖం పాలిపోయింది.

"డిన్నరా?" అంది ఆశ్చర్యంగా.

"అవును."

"ఎవరు తయారు చేస్తున్నారు?"

"ఇంకెవరు? నేనే! నాకు వంట రాదనుకొన్నారా?"

ఒక్కసారిగా పెద్ద బరువు దించినట్లయిం దామెకి. అంతలోనే నవ్వు కూడా వచ్చేసింది.

"నాకు మీరు వంట వండి భోజనం పెడతారా! బాగుంది. ఎవరయినా చూస్తే నవ్వుతారు. మీరే ఇక్కడికి రండి. ఇద్దరికీ వంట చేస్తాను."

"నో, ప్లీజ్! మీరు రావలసిందే. కావాలంటే వచ్చే ఆదివారం మీ ఇంటికి వస్తాను."

సరేననక తప్పలేదు మాధురికి.

"మరో గంటలో బయల్దేరి వచ్చెయ్యండి. అడ్రస్ గుర్తుంది కదా? ఆంజనేయస్వామి టెంపుల్ దగ్గిర బస్సు దిగితే చాలు కాలనీ కనబడుతూంటుంది."

అతను వెళ్ళిపోయాడు.

త్వరగా స్నానం ముగించి, అల్మారా లోని చీరలన్నీ బయటికి లాగిం దామె. ఏ చీర కట్టుకోవాలో ఓ పట్టాన తేల లేదు.

ఇంతకాలం తను ఆలోచించలేదు. ఏ చీరలో తను అందంగా కనబడుతుంది?

ఒక్కొక్క చీరా భుజాల వరకూ కప్పుకొని, అద్దం ముందు నుంచుని చూసుకోసాగిం దామె.

చివరకు వైలట్ రంగు చీర, అదే రంగు జాకెట్టు కట్టుకొంది.

అతని ఇల్లు చేరుకొనేసరికి పన్నెం డయిపోయింది.

ఆమెను చూడగానే ఆనందంగా ఆహ్వానించా డతను.

"రండి. ఇంక రారేమోనని కోపం వచ్చేసింది నాకు!"

తనవంకే తదేకంగా చూస్తున్న అతణ్ణి గమనించి సిగ్గు పడింది మాధురి.

"బస్సు వెంటనే దొరకలేదు." అబద్ధ మాడేసిం దామె.





జలక్రీడ

ఫోటో — [illegible]

"మీరు వచ్చారు. నా కథే చాలు. పదండి! అంతా సిద్ధం చేసేసి, మీకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను."

"ఇల్లు బాగానే ఉంది."

అంతా కలియజూస్తూ అంది మాధురి.

"అవును. దూరమని మొదట్లో సంశయించానుగానీ, ఇప్పు డీ ఇల్లు వ్రాసి రా బుద్ధి కావటం లేదు." అన్నా డతను.

"కాని, ఇంత పెద్ద ఇల్లేం చేసు కొంటారు?" నవ్వుతూ అం దామె.

"పోనీ — మీరుకూడా వచ్చెయ్య కూడదూ? మీ కో గది ఇస్తాను." అడిగా డతను.

మాధురి ఉక్కిరిబిక్కిరయ్యింది.

ఇద్దరూ ఒకే ఇంట్లో ఉండటమా? అంటే, అతని అర్థం ఏమిటి?

అతని వంక ఓ సారి చిరునవ్వుతో చూసి, చూపులు మరల్చుకొం దామె.

"అవునండీ. మీరు మా సీతకి కూడా తోడుంటారు."

ఉలిక్కిపడింది మాధురి.

"సీతా?" అడిగింది ఆశ్చర్యంగా.

"అవునండీ. ఓ! మీకు సీతని గురించి తెలి దనుకొంటాను. మా పక్కింటి అమ్మాయి లెండి. ఇద్దరం ప్రేమించు కొన్నాం. నాకు ఉద్యోగం రాగానే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొన్నాం. కులాలు వేరయినా, మా వివాహానికి పెద్దలు కూడా ఒప్పుకొన్నారు. ఇప్పు డిక ఉద్యోగం వచ్చేసింది కాబట్టి, వీలయి నంత త్వరలో వివాహం చేసుకోక తప్పదు!"

మాధురికి కళ్ళు తిరుగుతున్న ట్లని పించింది. గుండెల మీద సుత్తితో మెల్లిగా కొడుతున్న అనుభూతి.

కళ్ళ నిండుగా చేరింది కన్నీళ్ళు.

చేతులు వణుకుతున్నాయి.

"అయినా, మీకోసారి సీతను తీసుకుని వచ్చి పరిచయం చేస్తా నుండండి. బహుశా వచ్చే ఆదివారం మా ఊరు వెళ్తాను. అప్పుడు సీతను తీసుకువస్తాను. ముహూర్తం సరదాగా ..."

ఇంకేమీ వినిపించటంలేదు మాధురికి.

తను నింపు కొన్న ఆశలు, కోరికలు, ప్రేమ —

ఆ తరవా తేం జరిగిందో తనకు తెలీదు. అత నేం మాట్లాడుతున్నాడో, తనేం జవాబు చెబుతూందో, అసలు తనేం చేస్తోందో ...

"ఇంక వెళతాను" అని బయలు దేరటం ఒక్కటే గుర్తుంది.

"మీ రీవేళ అదోలా ఉన్నారు. ఒంట్లో బాగుండలేదా?" బస్సుస్టాప్ వరకూ నడిచి వచ్చా డతను.

"అవును ..."

బస్సు వచ్చింది.

అర గంటలో తన ఇల్లు చేరుకుంది మాధురి.

రాగానే తలుపులు మూసివేసి, మంచం మీద వాలిపోయింది.

సంతోషం లేదు, దుఃఖం లేదు, ఆలో చన ల్లేవు.

అంతా ఖాళీ.

లేచి కిటికీ దగ్గరికి నడిచిం దామె.

కార్లు, బస్సులు, లారీలు, ఆటోలు, జనం కోలాహలం...

అస్పష్టంగా వినబడుతున్నాయి శబ్దాలు.

ఊహుఁ! ఈ నిశ్శబ్దం తను భరించ లేదు!

ఈ అర్థం లేనిక జీవితం తను వహించ లేదు!

తనూ ఆ రద్దీలో, ఆ జనంతో కలిసి పోవాలి!

మరుక్షణంలో కిటికీ అద్దాలన్నీ పగిలి పోయాయి!

పెద్ద ఎత్తున శబ్దాలు గదిలోకి ప్రవేశించాయి!

కేకలు, హారన్లు, ఇంజన్ మోత, రిక్షా గంటలు ...

కళ్ళవెంట నీరు కారిపోతూనే ఉంది మాధురికి. ఆమె మనస్సు క్రమ క్రమంగా తేలికపడుతూ ఉంది. *